

# పసిడిమనసులు

## - షర్మిల



## ఈరాపాత్రుడు

**పొద్దున్నే** వెనకవైపు తలుపుతీసి అమ్మ ఎందుకో కెవ్వున అరిచింది .

దొంగ దొంగ అనటం విన్న నాన్న, బాబాయ్ గబ గబా పరిగెత్తారు. ఈ లోగా మా చిన్న తమ్ముడు మంచం కిందకి దూరాడు .

తరవాత " ఏరా ? ఇదేనా నీ ధైర్యం" అని వెక్కిరిస్తే "అదేం కాదు , ఆ దొంగ మిమ్మల్ని అందరినీ కాల్చి చంపేస్తే మంచం కింద వున్న నేను వాడిని గుర్తుంచుకుని పెద్దయ్యాక చంపెయ్యడానికి దాక్కున్నా" అన్నాడు.

వాడు అమితాబ్ బచ్చన్ సినిమాల ప్రభావంలో వున్నాడు మరి. అమ్మ అరుపులకి అందరూ వెళ్లి చూసే సరికి వెనక స్టోర్ రూం తెరిచి చిందరవందర చేసి వుంది. ఆ స్టోర్ రూం బయట ఒక ఆకారం అడ్డంగా పడిపోయి వుంది . వెళ్లి చూస్తే అదో బొమికలగూడు లాంటి మనిషి, పక్కనే లుంగీలో కట్టిన న్యూస్ పేపర్ల మూట. ఆ వ్యక్తి వంటి మీద ఏ ఆచ్చాదనా లేదు మా నాన్న పారేసిన పాత అండర్ వేర్ తగిలించుకున్నాడు. అతని లుంగీ విప్పి అందులో న్యూస్ పేపర్లు మూట కట్టుకున్నాడు. వాటిని భుజమ్మీద వేసుకుని తీసికెళ్తూ నీరసంతో పడిపోయి అపస్మారకంలోకి వెళ్లి పోయాడు. నాన్న, బాబాయ్ అతన్ని ముందు వసారాలో పడుకోబెట్టారు .

అతను ఎంత పిలిచినా పలకలేదు. పోలీసులకి ఫోన్ చేసే బదులు కేజీహెచ్ లో చేరిస్తే వైద్యం అందుతుందని తీసుకెళ్లాలని నిర్ణయించారు.

అంబులెన్స్ కోసం మనిషిని పంపారు. ఆ రోజుల్లో కేజీహెచ్ మా సొంత హాస్పటల్ అన్నట్టుండేది. మా కజిన్స్ ఇద్దరు అక్కలు , ఇద్దరు బావగార్లు హౌస్ సర్జన్లు ,మా మావయ్య రేడియాలజీ డిపార్ట్మెంట్ హెడ్. వాళ్ల వల్ల ఇంకా బోలెడు మంది డాక్టర్లతో పరిచయాలు వుండేవి. దీనితో మేం సొంత జాగీరులా వుపయోగించుకునేవాళ్లం. ఎనిమిదో తరగతిలో ఒక సారి నాకు టాన్సిల్స్ ఆపరేషన్ కూడా అక్కడే చేయించారు.

పొద్దున్నే మా నాగేశ్వరరావు మావయ్యగారితో ఆస్పత్రికి పంపారు.

నేను ఎర్ర శాటిన్ మేక్సీ వేసుకుని ఆస్పత్రికి వెళ్లాను. మావయ్య గారు ఆస్పత్రికి వెళ్లాక అన్నారు .

"చూడు ! ఇది పేదల ఆస్పత్రి , మనం పెళ్లికి రాలేదు, ఇక్కడికి నువ్వు పిల్లజమీందార్ లాగా బట్టలేసుకు రాకూడదు" అన్నారు.

పొద్దున అమ్మ మామూలు బట్టలిస్తే నేనే అంత ఆపరేషన్ చేయించుకోవడానికి వెళ్తూ ఈ బట్టలా అని మూలకి విసిరేసి ఈ శాటిన్ డ్రెస్ వేసుకున్నాన .

విశాఖపట్నంలో అప్పుడు కార్పోరేట్ ఆస్పత్రులు లేవు . కేజీహెచ్లోనే మంచి డాక్టర్లు వుండేవారు. అంబులెన్స్ వచ్చింది.

నేలమీద పడుకోబెట్టిన అతన్ని అంబులెన్స్ ఎక్కించి కేజీహెచ్ కి తీసుకెళ్లారు. అక్కడ బావగారికి చెప్పి జాయిన్ చేయించారు.

రెండు రోజుల తర్వాత నాన్న, బాబాయ్ ఇద్దరూ అతన్ని చూట్టానికి వెళ్లి వచ్చారు .

అతను కొంచం కళ్లు తెరిచి చూసి పేరు, వూరు మాత్రం చెప్పాడంట .

అతని పేరు ఈరాపాత్రుడు, వూరు నర్సీపట్నం దగ్గర పల్లెటూరు .

ఈరాపాత్రుడు ఎన్నో రోజులుగా ఏమీ తినలేదని అందుకే అలా శుష్కించి పోయి , కోమాలోకి వెళ్లిపోయాడని డాక్టర్లు చెప్పారు .

నాన్న ఒక మనిషిని అతని వూరు పంపిచారు . ఈరాపాత్రుడి ఇంట్లో వాళ్లు వచ్చేసరికే అతను చనిపోయాడు .

కొడుకు ఏడుస్తూ చెప్పాడు. "ఏటి సెప్పాల ! వున్న బూవిని నమ్ముకుని కట్టం సేసుకుని బతికాం. ఈ ఏడు వానలు పడక తిండికే కట్టమైంది. ఇసాపటం ఎల్లి కూలి చేస్తే కూటికన్నా వత్తాయని వచ్చినాడు. ఇదిగో ఇలగైపోనాడు !"

ఈరాపాత్రుడు ఒక రైతు కష్టపడటమే తెలుసు, చెయ్యి సాచి అడుక్కుని తింటం తెలీదు . పిల్లకాలవ నుంచి సముద్రంలో పడినట్టు విశాఖపట్నం లో బతకలేకపోయాడు .

పని దొరక్క , అడుక్కోలేక దొంగతనమైనా చేసి ఆకలి తీర్చుకుందామని మా ఇంటికి వచ్చాడు . పేపర్లు అమ్ముకుని ఆ రూపాయి తో కడుపు నింపుకుందామనుకున్నాడో, వూరెళ్లి పోదామనుకున్నాడో మరి. ఆకలి ఈరాపాత్రుడిని కాటేసింది. కనీసం మా ఇంటి వెనక్కి వచ్చే బదులు గుమ్మం దగ్గరికి వచ్చి ఆకలి అంటే మా అమ్మ కడుపునిండా భోజనం పెట్టేది . నాన్న బస్ చార్జీలు ఇచ్చి పంపేవారు.

కానీ అలా ఒకరిని చేయిసాచి అడగడానికి మొహంచెల్లని బడుగు రైతు

*(వచ్చేనెల మరో కథ)*

Click here to share your comments